

అంగన్వాడీ భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని కించుమండ పంచాయతీ కొసొంగుడలో అంగన్వాడీ భవనాన్ని స్థానిక పంచాయతీ సర్పంచి చెల్లమ్మ గురువారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అంగన్వాడీ భవనం లేకపోవడంతో ఇన్నాళ్లు చిన్నారులు, బాలింతలు, గర్భిణులతో పాటు సిబ్బంది వసతికష్టాలతో ఇబ్బందులు పడగా, సొంత భవనం సమకూరడంతో వారి కష్టాలు తీరిపోయినట్టేనని సర్పంచ్ అన్నారు. అంగన్వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారం, ఇతర సేవలను సక్రమంగా అందించేందుకు అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచి సంజీవ్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వార్డు సభ్యులు కెసుబో, అప్పన్న, చంద్రమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి పిహెచ్‌సికి జాతీయస్థాయి గుర్తింపు

ఎన్‌క్యూఎఎస్ ప్రమాణాల మేరకు వైద్యసేవలకు సర్టిఫికేషన్


అనంతగిరి పిహెచ్‌సి

ప్రజాశక్తి - అనంతగిరి : జాతీయ నాణ్యత అంచనా ప్రమాణాలు పాటించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో 91.64 గుర్తింపు వచ్చిందని స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ జ్ఞానేశ్వరి అన్నారు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 24న నేషనల్. క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఎఎస్) బృందం మండల పర్యటనలో భాగంగా స్థానిక ఆసుపత్రికి సందర్శించారన్నారు. ఆసుపత్రి పరిశుభ్రత, పిహెచ్‌సి లోపల, బయట మంచి వాతావరణంలో రోగులకు మెరుగైన సేవలు అందించడం, అవసరమైన మందుల నిల్వలుఅందుబాటులో ఉండడం, గర్భిణులు,బాలింతలకు పరిశు భ్రమైన గదులలో మెరుగైన వైద్య సేవలు అందించడం వంటి పలు అంశాలను పరిశీలించి, వాటిల్లో మెరుగ్గా ఉండడంతో ఈ మేరకు జాతీయస్థాయిలో గుర్తింపునిచ్చారన్నారు. కాగా పిహెచ్‌సిలో ముఖద్వారం వద్ద శిథిలావస్థలో ఉన్న మెట్లు పునర్నిర్మాణానికి మండల పరిషత్ నిధులు మంజూరు చేయడంపై వైద్యాధికారి జ్ఞానేశ్వరి హర్షం వ్యక్తం చేస్తూ, ఎంపిపి శెట్టి నీలవేణి, ఎంపిడిఒ ఎవివి.కుమార్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరెంటిండెంట్ నర్సింగరావు, పిహెచ్ఎన్ విమల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పెదపాడు గిరిజనులకు పాదరక్షల పంపిణీ


ఇంటింటికీ వెళ్లి పివిటిజిలకు పాదరక్షలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడులోని 87 కుటుంబాలకు చెందిన 345మంది ఆదివాసీ గిరిజనులకు గురువారం అధికారులు చెప్పులు పంపిణీ చేశారు. ఈ నెల 7న డిప్యూటీ సిఎం పవన్ మన్యం పర్యటనలో భాగంగా పెదపాడు గ్రామస్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు వారిసమస్యలను అడిగి తెలుసుకున్న క్రమంలో పాంగి మిత్తు అనే గిరిజన వృద్ధురాలు పాదరక్షలు లేకుండా కార్యక్రమానికి వచ్చిన విషయాన్ని గుర్తించారు. గ్రామంలో అనేక మందికి పాదరక్షలు లేకుండా ఉండడంపై చలించిపోయిన పవన్ వెంటనే గ్రామంలోని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎంతమంది ఉన్నారో అందరికీ చెప్పులు పంపిణీకి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో .మండల ఉపాధి హామీ పథకం యంత్రాంగం గ్రామంలో ఎన్ని కుటుంబాలున్నాయి, పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతమంది ఉన్నారు, వారి చెప్పుల సైజులపై సర్వే చేశారు. వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తేగా, ఉపముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది పర్యవేక్షణలో కొనుగోలు చేసిన చెప్పులను గురువారం పెదపాడు గిరిజనులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బంది బోయిపల్లి పవన్, సిబ్బందితోపాటు స్థానిక సర్పంచ్ వెంకటరావు, వార్డు సభ్యుడు రామునాయుడు, ఎపిఎం దొరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ శాంతకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లాభాపేక్ష లేని సంస్థల సేవలు పెరగాలి

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : జిల్లా అభివృద్ధికి లాభాపేక్ష లేని సంస్థల సేవలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ అన్నారు.. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి లాభాపేక్ష లేని సంస్థల ఫోరం జిల్లా మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా లాభాపేక్ష లేని సంస్థల ఫోరం చైర్మన్, కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా సమగ్ర అభివృద్ధి, నివాసితుల సంక్షేమానికి జిల్లా పరిపాలన యంత్రాంగం, లాభాపేక్షలేని సంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో పరస్పర సహకారం, ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకారాన్ని సులభతరం చేయడం, సమాచారాన్ని పంచుకోవడం, సవాళ్లను పరిష్కరించడం, సమాజానికి సేవ చేయడంలో లాభాపేక్షలేని సంస్థలు పూర్తిసహకారం అందించాలని కోరారు. రానున్న కాలంలో జిల్లాలో ఉత్తమ విద్యార్థుల తయారీకి, శత శాతం ఆర్గానిక్ జిల్లాగా తీర్చిదిద్దటానికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. జిల్లా స్థాయి ఫోరంతోబాటు మండల స్థాయిలో ఎంపిడిఒ నోడల్ అధికారిగా వివిధ సంస్థల సహకారంతో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో లాభాపేక్ష లేనిపలు సంస్థల ప్రజెంటేషన్‌ను కలెక్టర్ వీక్షించారు. సైన్సు ఫర్ బెటర్ సొసైటీ, సెంటర్ ఫర్ హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ ట్రస్ట్, ట్రైబల్ హెల్త్ అండ్ వెల్ఫేర్ వాలంటరీ ఆర్గనైజేషన్, ట్రైబల్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, నైసే ఫౌండేషన్, నవజీవన్ ఆర్గనైజేషన్, వాసన్, సజన వెల్ఫేర్ అసోసియేషన్, లైఫ్ ఫౌండేషన్, అగ్రికల్చర్ అండ్ సోషల్ డెవలప్మెంట్ సొసైటీ సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, దండకారణ్య ఎడ్యుకేషనల్ సొసైటీ, ది ఎబిలిటీ పీపుల్, లయ ఫౌండేషన్, శారదా వేలీ డెవలప్మెంట్ ఫౌండేషన్ తదితర లాభాపేక్ష లేని సంస్థలు తాము చేస్తున్న, చేయబోతున్న వివిధ కార్యక్రమాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిఎస్‌డబ్ల్యు ఇన్‌ఛార్జి పిఎస్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌పిఎస్ నంద్, డిఇఒ పి బ్రహ్మాజీ రావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్ రజని, స్కిల్ డెవలప్మెంట్ అధికారి డాక్టర్ పి. రోహిణి, స్త్రీ శిశు సంక్షేమ అధికారి ఎన్. సూర్యలక్ష్మి, డ్వామా పిడి విద్యాసాగర్, నీతి అయోగ్ ప్రతినిధులు నారాయణ రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

విఒఎలకు రక్షణ కల్పించాలి

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ, వినతి

సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ


సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న వెలుగు విఒఎలు

ప్రజాశక్తి - పాడేరు: గ్రామాల్లో విధుల నిర్వహణ సమయంలో వెలుగు విఒఎలపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వాటిని నిర్మూలించి రక్షణ కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేపట్టి వినతిపత్రం అందజేశారు. విఒఎల ఆందోళనపై సానుకూలంగా స్పందించిన కలెకట్, కార్యాలయం గేటు వద్ద ఆందోళన చేస్తున్న విఒఎల వద్దకు డిఆర్‌డిఎ పిడిని పంపించి, సమస్యల పరిష్కారానికి చర్చించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరావు మాట్లాడుతూ గ్రామ సంఘాల్లో పనిచేస్తున్న విఒఎలు ప్రభుత్వ పథకాలు, ఇతర కార్యక్రమాల అమలు సందర్భంగా దాడులకు భయపడే పరిస్థితి ఉందన్నారు. పాడేరు మండలం గుడివాడ, హుకుంపేట మండలం, దుంబ్రిగుడ మండలం సోవ్వ గ్రామాల్లో విఒఎలపై దాడులు జరిగాయన్నారు. ఫిబ్రవరిలో సొవ్వలో రికవరీకి వెళ్లిన విఒఎపై దాడి జరిగిందని, దీనిపై పోలీసు లు, డిఆర్‌డిఎ పీడీ వి.మురళికి తెలియజేసినా స్పందించలేదని మండిపడ్డారు. తాజాగా ఈనెల 14న అరకు వ్యాలీ మండలం డప్పుగుడలో వార్షిక జీవనోపాధి ప్రణాళిక సర్వే చేస్తుండగా జి. భీమన్న అనే విఒఎ హత్యకు గురయ్యాడన్నారు. అనేకమంది మహిళా విఒఎలపై విచక్షణా రహితంగా దాడులు జరుగుతున్నా పట్టించు కోకపోవడం దుర్మార్గమన్నారు.

విఒఎల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌పి పోతురాజు మాట్లాడుతూ హత్యకు గురైన విఒఎ జి.భీమన్న కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం చెల్లించాలని, విఒఎలకు ఉద్యోగ భద్రత, బీమా కల్పించాలని, గ్రామాల సందర్శనలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారుకార్యక్రమంలో విఒఎల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌బి. రాజ్‌కుమార్, భాను, దాడులకు గురైన బాధిత విఒఎల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశించినా కదలరేం?

- ఆదివాసీ చట్టాలపై గ్రామసభల నిర్వహణలో నిర్లక్ష్యం
- అధికారులకు ఆదివాసీ గిరిజన సంఘం వినతి


డిటికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- హుకుంపేట: ఎల్‌టిఆర్ కేసులు, 1/70 చట్టం, ఇతర ఆదివాసీ చట్టాలపై గ్రామసభలు నిర్వహించి, గ్రామస్థాయిలో గిరిజనులకు అవగాహన కల్పించాలని జిల్లాలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు జిల్లా కలక్టర్ లిఖితపూర్వకంగా సర్క్యులర్ జారీ చేసి ఆదేశించినా, అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ నేతలు ప్రశ్నించారు. ఎనిమిది అంశాలపై తక్షణమే అవగాహన కల్పించాలని ఈనెల 8న కలెక్టర్ జారీచేసిన సర్క్యులర్‌లో స్పష్టంగా పేర్కొన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సిహెచ్.కృష్ణారావుకు వినతిపత్రం అందజేసినట్లు ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు తెలిపారు.

ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1/70 భూబదలాయింపు నిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తూ గిరిజనేతరులు భూమార్పిడికి పూనుకోవడ, బినామీపేరుతో అక్రమ నిర్మాణాలు, ఇతర ఆదివాసీ చట్టాల ఉల్లంఘనపై పోరాటం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం, దీనిపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసింది.

ఎట్టకేలకు స్పందించిన జిల్లాకలెక్టర్ దినేష్‌కుమార్, ప్రత్యేకంగా సర్క్యులర్ జారీచేసి, గిరిజన చట్టాలపై అవగాహన కల్పించాలని ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. అంతేకాక భూబదలాయింపులు, ఇతర ఉల్లంఘనలపై గిరిజన సంక్షేమశాఖ స్పెషల్‌డిప్యూటీ కోర్టులో కేసు దాఖలు చేయాలని తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశించినా ఆ దిశలో చర్యలు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో ఆదివాసీ చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు వాటి పటిష్ట అమలుకు చర్యలు చేపట్టాలని కృష్ణారావు కోరారు. డిటికి వినతిపత్రం ఇచ్చిన వారిలో హుకుంపేట వైస్ ఎంపిపి కొండలరావు, సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి లింగమూర్తి, టి.అప్పలకొండ పడాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిద్దాం

యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రచార ర్యాలీ


యుటిఎఫ్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అడ్డతీగల

పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిద్దాం... సర్కారు బడులను రక్షించుకుందాం... అంటూ స్థానిక మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యాన గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. "ప్రభుత్వ పాఠశాలలే ముద్దు.. ప్రైవేట పాఠశాలలు వద్దు...", "ప్రైవేట్ పాఠశాలలు ఎందుకు దండగ.. ప్రభుత్వ పాఠశాలలు మన ఊరులో ఉండగా.." అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గ్రామంలో తల్లిదండ్రులకు కరపత్రాలు పంపిణీ చేసి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తేజోరావు, మండల అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవులు మాట్లాడుతూ అమ్మ ఆప్యాయత, మానవత్వపు పరిమళం, ఎదుటివారి కష్టాల్లో ఉంటే సహాయపడటం, జట్టుతత్వం, ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనే ధైర్యం, ఎదుటివారితో గౌరవంగా మెలగడం, సమాజంలో ఎలా జీవించాలో నేర్పించడం, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలనే స్పృహ వంటివి ప్రభుత్వ బడి నేర్పిస్తుందని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ఈనెల 23వ తేదీ వరకు కొనసాగుతుందని, మండలంలోని ప్రతి గ్రామానికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను తెలియజేసి పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు మండలంలోని మల్లవరం, మావుళ్ళు, నిమ్మలపాలెం, తుంగమడుగుల, అనుకులపాలెం, డి.రామవరం, డి.కొత్తూరు, దుశ్చర్తి, అడ్డతీగల వీరభద్రపురం, కోనలోవ, గవరయ్యపేట, కొట్టంపాలెం గ్రామాల్లో ప్రచారం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు జగదీష్, కోశాధికారి దొరబాబు, ఎఫ్‌డబ్ల్యుఎస్ కె.చిన్నారావు, వెంకటరత్నం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-విఆర్.పురం

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసిడిఎస్ కూనవరం ప్రాజెక్టు అధికారి పి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని రేకపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో 7వ పౌష్టికాహారం పక్షోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. ఇందులో మండల తహశీల్దార్ సరస్వతి, మండల అభివృద్ధి అధికారి రామాంజనేయ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, పసిపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్వాడి కేంద్రంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు తల్లులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుండి రేకపల్లి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ప్రథమ్ కోఆర్డినేటర్, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, జిఎంఎస్‌కె హెల్త్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, వెలుగు, వైద్య సిబ్బంది


అవగాహన కల్పిస్తున్న జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు

ఆన్‌లైన్ గేమ్స్‌తో మోసపోవద్దు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

యాప్‌ల్లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడి మోసపోవద్దని జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు యువకులకు సూచించారు. జడ్డంగి మూడు రోడ్లు జంక్షన్ వద్దగురువారం సాయంత్రం పోలీసులు ఆధ్వర్యంలో జనమైత్రి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ గంజాయి సాగు, విక్రయం, రవాణా, వాటిని ప్రోత్సాహించడం నేరమని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐలు భాగ్యశ్రీ, బషీర్, హెడ్ కానిస్టేబుల్ శాస్త్రి, కానిస్టేబుల్ ప్రసాద్‌రెడ్డి, హోంగార్డు సింహాచలం పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

బాల్య వివాహాలను నిర్మూలించాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి గంగవరం

బాల్యవివాహాలను నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహచలం పేర్కొన్నారు. గంగవరం మండలం కొత్తడ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో కిశోర వికాసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిఒ సింహాచలం మాట్లాడుతూ బాలికలు బాల్య వివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలు నిర్మూలించే విధంగా ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికలు 21 సంవత్సరం నిండకుండా పెళ్లి చేసుకుంటే ఆరోగ్యపరంగా చాలా ఇబ్బంది పడతారని తెలిపారు. మంచి చదువులు చదువుకొని ఉద్యోగాలు సంపాదించిన తర్వాతే తల్లిదండ్రులకు, మీకు నచ్చిన అబ్బాయిలతో వివాహం చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల నిండకుండా ఏ అమ్మాయికైనా వివాహం చేస్తే వెంటనే ఐసిడిఎస్ అధికారులకుగాని, పోలీస్ స్టేషన్లో గాని తెలియజేయాలని కోరారు. 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లిళ్లు చేసినా, వాటిని ప్రోత్సహించినా చట్టరీత్య నేరమన్నారు. వేసవి సెలవులకు ఇండ్లకు వెళ్లిన వెంటనే జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు చదువుకుంటే మంచి తెలివితేటలు పెరుగుతాయని చెప్పారు. అనంతరం కొత్తాడ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. బాలింతలకు, గర్భిణులకు, పిల్లలకు అందుతున్న పదార్థాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి, కేజీబీవీ పాఠశాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, ఎంపిటిసిలు

మంచినీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని పలు గ్రామాలలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలంలోని చాలా గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా కూటూరు గ్రామంలో గతంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా వేసిన సోలార్ ప్లేట్లు పగిలిపోయి పనిచేయడం లేదని చెప్పారు. రేగులపాడు, లింగాపురం పంచాయితీల పరిధిలోని గ్రామాలలో జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయక అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కొన్ని చోట్ల కొత్త పథకాలు మంజూరైనా నిర్మాణ ప్రక్రియ చేపట్టలేదన్నారు. చూచిరేవుల గూడెం పంచాయితీలో కొత్త పథకం మంజూరు చేయాలని కోరారు. మండల పరిషత్ సమావేశంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య ఈ సమస్యలను ప్రస్తావించినా ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరితగతిన పాత వాటికి మరమ్మతులు చేయించి మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కొత్తగా మంజూరైన వాటిని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని రంప శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో బ్రహోత్సవాలు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా చక్రస్నానం ఘట్టం, శ్రీపుష్పయాగం వేడుకలు ఆలయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు, పణిహారం వేణుగోపాల్, ఫణి కిరణ్, ఎస్‌టిపి రఘునాథ శ్రీహాసాచార్యులు, సిహెచ్.శ్రీరామాచార్యులు, పి.రంగాచార్యులు ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవార్లకు మహిళా భక్తులు సారె సమర్పించారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చింతూరు

మండలంలో ఉపాధి హామీ కింద పనులు చేసిన కూలీలకు బకాయి ఉన్న కూలి డబ్బులు తక్షణమే చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లి గ్రామంలో గురువారం సిపిఎం నాయకులు ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పనులు జరుగుతున్న ప్రదేశంలో టెంట్, తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్టు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు 10 నెలల నుండి కూలి డబ్బులు చెల్లించలేదని, ఇలా అయితే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, మండల కమిటీ సభ్యులు చింత రాంబాబు, సవలం కన్నయ్య, నాయకులు మడివి రాజేష్, సవలం దేశయ్య, నాగమణి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని జి. తాడేపుట్టు పంచాయతీ కడుసుపల్లి గ్రామంలో చలివేంద్రాన్ని స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి, గ్రామస్తులు నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు బాటసారులు దాహార్తితో ఇబ్బంది పడకుండా బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మయ్య, రాము, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం నీళ్లకుండీలలో శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాల రెండవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రా యూనివర్సిటీ ఎన్విరాన్మెంటల్ స్టడీస్ హెచ్‌ఓడి ప్రొఫెసర్ సాల్మన్ రాజు, హాటంగాంజీ డైరెక్టర్ ఎలిపె బంగార్రాజు, విజయ భాను కోటి హాజరై మాట్లాడుతూ, తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు పిల్లల అభివృద్ధికి తగ్గ శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల అభివృద్ధి, గత రెండేళ్లలో విద్యార్థులు సాధించిన విజయాల గురించి పాఠశాల డైరెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, గీతాలు, నాటికలు, యోగాసన ప్రదర్శనలు నిర్వహించారు. మార్షల్ ఆర్ట్స్, చిన్నారులు చేసిన బైక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల డ్రిల్, జాతీయ గీతాల ఆలాపన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శర్మ, సిహెచ్.వీరబాబు, వి.సురేష్, లెంక సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ.1.65 లక్షలు అందజేత

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంధ్రా యూనివర్సిటీకి 2022 -23 ,2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించిచెల్లించాల్సిన అనుబంధ రుసుము రూ.1.65 లక్షల చెక్కును విష్ణాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ ఇన్‌ఛార్జి ఎ.శ్రీనివాస్ గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణికి అందజేశారు. తమ కళాశాలకు ఆర్థిక వనరులు సరిపడా లేనందున ఎయిడు బకాయి ఉన్న అనుబంధ రుసుములు చెల్లించాల్సి ఉండని, ఇందుకు సహకారం అందించాలని ప్రిన్సిపల్ కోరిన మీదట తమ సంస్థ సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీతంనాయుడు, సిఎస్ఆర్ ప్రతినిధులు పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆరోగ్యవంతమైన బిడ్డలను కనేందుకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి ఎంపిడిఓ డాక్టర్ వి.జానకి సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా గురువారం ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకూ వైద్యుల సూచనల మేరకు మందులు, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటేనే బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. గర్భిణులు బయట హోటళ్లలో ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్, చాక్లెట్స్ వంటివి తీసుకూడదని స్పష్టం చేశారు. ఐసిడిఎస్ పిఒ శ్రీదేవి మాట్లాడుతూ, గర్భిణులు ప్రతిరోజూ పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి, ఫలాలు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డిటి ఎల్లా చేతన్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పివివి.రత్నం, జె.రేఖావాణి, సిహెచ్ శ్రీనివాసరావు, పార్వతమ్మ, ఎపిఎం రేణుక, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని,జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం పాడేరులోని క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు, ఇతర అన్ని వర్గాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి సంక్షేమాన్ని రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పెదబయలు మండలం కిముడుపల్లి డిఆర్ డిపో భవన మరమ్మతులు చేయాలని వినతిరాగా, దానిపై అంచనా ప్రతిపాదనలు రూపొందించాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. జిసిసిలో 150 కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయన్న వినతిపై స్పందించి, దీనిపై బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు జిసిసి రిటైర్డ్ ఎంప్లాయ్ సేల్స్‌మెన్ , సింహాచలం తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావట్లేదని చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు అరక ు వేలి మాడగడ్డ నుండి కిల్లో కళమ్మ టెన్షన్ రావటం లేదని అర్జీ పెట్టుకోగా వెనువెంటనే ఎంపిడిఒకు ఫోనుచేసి మాట్లాడారు డుంబ్రిగూడ మండలం గసభలో సెల్ టవర్ కావాలని కోరగా ఉన్నత అధికారులను దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతామన్నారు. రహదారులు, తాగునీరు, ఇతర సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బాకూరు వెంకటరమణ రాజు, దారెల సర్పంచ్ కాంగి పాండురంగ స్వామి, పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాగర సుబ్బారావు, పద్మపురం ఎంపిటిసి సాయి, మాజీ సర్పంచ్ వాసుదేవ్, ఎంపిటిసి రమ మహిళ నాయకురాలు మహేశ్వరి, ద్రౌపది, కళ, మాజీఎంపిపి అమ్మన్న, జిసిసి డైరెక్టర్ బుర్ర నాగరాజు క్లస్టర్ ఇంచార్జి త్రినాథ్‌చ మురళి అచ్చిబాబు మాజీ సర్పంచ్ శ్రీనాథ్ నాగేశ్వరరావు రమేష్ శోభకోట సర్పంచ్ శశిభూషణ్ నాయుడు పాల్గొన్నారు.

హాట్ బజార్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: హాట్ బజార్స్ భవన నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని ఐటిడిఎ ఎపిఒలు ఎం.వెంకటేశ్వరరావు, వి.ఎస్.ప్రభాకరరావు సూచించారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిసిసి, వెలుగు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడేరు ఐటిడిఎ పరిధిలోని 44 హాట్ బజార్స్ మంజూరయ్యాయని,. సొంత భవనాలు లేని విడివికెలు హాట్ బజార్స్ ని ఉపయోగించుకోవచ్చున్నారు. ప్రతి మండలానికి ఒక మినీ సూపర్ బజార్ మంజూరయ్యాయని, వాటికి కావాల్సిన ఐటమ్స్ జిసిసి ఇస్తుందన్నారు. పిఎం జన్‌మన్‌లో మంజూరైన 8 విడివికెలు ఉపయోగించుకుని అక్కడ ప్రతిరోజూ తెరచి పనులు మొదలు పెట్టాలని ఎపిఎంలకు ఆదేశించారు. యంత్రాలు కొనుగోలుకు మంజూరైన వాటిలో ఖర్చు, మిగిలిన వివరాలను ఎపిఎంలను అడిగి తెలుసుకున్నారు. యంత్రాలు కొనుగోలు చేయని ఎపిఎంలు వెంటనే కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిఆర్ డిపోలలో ఉన్న పాత, కొత్త స్టాక్ వివరాలు సమర్పించాలని జిసిసి అధికారులను ఆదేశించారు. మరమ్మతులో ఉన్న డిఆర్ డిపోలు, గోడౌన్‌లు, డిఆర్ డిపో కం సూపర్ బజార్‌లు జాబితాను పంపాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో మార్పులు ఉంటే కారణాలతో పాటు లక్ష్యాల వివరాలు పంపాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో హాట్ బజార్స్, గోకులాలు, మల్టీ పర్పస్ సెంటర్స్, రోడ్లు నిర్మాణాలు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పాడేరు, అరకువ్యాలీ గిరిజన సంక్షేమ విభాగం ఇఇలు జి.డేవిడ్ రాజు, కె.వేణుగోపాల్, పాడేరు, చింతపల్లి జిసిసి డిఎంలు డి.సింహాచలం, పి దేవరాజు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, వెలుగు ఎపిఎం(ఫైనాన్స్) విఎస్.ప్రసాద్ 11 మండలాల డిఇఇలు, ఎఇఇలు, వెలుగు ఎపిఎంలు, జిసిసి బిఎంలు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

ప్రజాశక్తి- పెదబయలు

వేతన పెంపు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు కోరారు. గురువారం పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. మండలంలోని 23 పంచాయతీ గ్రామాల్లో 19ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నా తాము అనేక సమస్యలతో బాధపడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెబాట పడతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డు అసిస్టెంట్లు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మండలంలోని చెట్టుపల్లి గ్రామానికి చెందిన అధికార కృష్ణవేణి అలియాస్ సరోజిని(32) ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వేధింపులు తాళలేక ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. చెట్టుపల్లి గ్రామానికి చెందిన అధికార రాజేష్‌తో సరోజినికి 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడేళ్లుగా భర్త నుంచి వేధింపులు ఎక్కువగా ఉండడంతో గురవారంఉదయం పిల్లలు స్కూల్‌కు వెళ్ళిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని మృతి చెందింది. నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు సంఘటనాస్థలాన్ని సందర్శించి, వివరాలను ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పరిశీలించి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని కాగిత జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం బైక్‌పై నుండి జారిపడి మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. మునగపాక మండలం, ఒంపోలు గ్రామానికి చెందిన దిమిలి వెంకటలక్ష్మి (46) తన కుమారుడితో కలిసి బైక్‌పై కత్తిపూడి బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, కాగిత వద్దకు వచ్చేసరికి బైక్ వెనుకన కూర్చున్న దిమిలి వెంకటలక్ష్మి జారిపడింది. గాయపడ్డ ఆమెను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సన్ని బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వెదుళ్ళపాలెం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. అగనంపూడి నుంచి వి శివకృష్ణ, జే మనోజ్ కుమార్, కె.రవి, ఎం.కష్ణంరాజు కారులో రాజమండ్రి వెళుండగా వీరు ప్రయాణిస్తున్న కారు నక్కపల్లి మండలం, వెదుళ్ళపాలెం జంక్షన్ దాటిన తర్వాత ఆగి ఉన్న లారీని ఢీకొట్టి డివైడర్ పైకి కారు దూసుకుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పెద్ద ప్రమాదం నుండి బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో కారు దెబ్బతింది.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు షేర్లలో నగదు పోగొట్టుకొని ఇంటునుంచి అదృశ్యమైనట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడ బీసీ సి కాలనీకి చెందిన పిసిని డేవిడ్ ఇంటర్మీడియట్ చదువును మధ్యలోనే ఆపేశాడు. షేర్ మార్కెట్‌లో పెట్టి రూ.6 లక్షలు పోగొట్టుకున్నాడు. మానసిక వేదనకు గురయ్యాడు. ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే మొబైల్ స్విచ్ ఆఫ్ అయింది. సమీప ప్రాంతాలు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యువకుని తల్లి ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలను అమలుచేయాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓ వైపు వంట గ్యాస్ సిలిండర్‌కు సబ్సిడీ ఇస్తున్నట్టుగా చెబుతూ మరో వైపు ధరను పెంచడం ఏ మేరకు సబవని ప్రశ్నించారు. వంట గ్యాస్ సబ్సిడీ ఎక్కువ మందికి అందడం లేదన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంత ప్రజలకు రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మోర అప్పలరాజు, సూరిబాబు, గోవింద, రామకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.



డిఎస్‌సి మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి డోలా

పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పన

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, మధురవాడ : పేదలకు నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఉచిత డిఎస్‌సి శిక్షణా కేంద్రం, మధురవాడలోని కళాశాల ఎస్‌సి వసతి గృహాన్ని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌సి శిక్షణ కేంద్రంలో క్లాస్ రూమ్‌లో విద్యార్థులతో పాటు కూర్చుని సిబ్బంది బోధనా తీరును మంత్రి పరిశీలించారు. అభ్యర్థుల సమస్యలు, శిక్షణ కేంద్రంలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3400 మంది పేద విద్యార్థులకు ఉచితంగా డిఎస్‌సి శిక్షణ ఇస్తున్నామన్నారు. గురుకులాల్లో నీట్ శిక్షణ కేంద్రాలు ప్రస్తుతం మూడే ఉన్నాయని, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనతో పదికి పెంచుతున్నామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్ లాగ్ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం పది నెలల కాలంలోనే రూ.300 కోట్లతో కొత్త ఎస్‌సి హాస్టళ్ల నిర్మాణం, గురుకులాలు, వసతి గృహాల్లో మరమ్మతులు చేయించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించినట్టు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం పెడతామని తెలిపారు. పి4 ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎంవిపి.కాలనీలోని సాంఘిక సంక్షేమ జిల్లా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మధురవాడలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహం -1ను మంత్రి సందర్శించి హాస్టల్ స్థితిగతులను వార్డెన్లు బ్రహ్మానందం, ఎస్.రమేష్‌లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వసతి సౌకర్యాలను పరిశీలించారు. హాస్టల్‌కు ఆనుకొని ఉన్న సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె నిర్మాణం, హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : అగ్నిమాపక వారోత్సవాలు నాలుగో రోజు రంపచోడవరంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బహుళ అంతస్తుల భవనాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తాళ్లతో సహాయంతో ఏ విధంగా తప్పించుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గంగన్న, సిబ్బంది, కెజిబివి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బందం శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ హాజరై మాట్లాడారు. అన్ని శాఖల పని తీరుపై సమీక్ష చేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు ఎంపిటిసిలు, సర్పంచులకు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్రీనివాస్ దొర, పంచాయితీ విస్తారణాధికారి కెఆర్‌యుఎల్ పద్మజ, జెడ్‌పిటిసి సభ్యురాలు పండా వెంకట లక్ష్మి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : పరవాడ ఫార్మా సిటీలో తాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. తాడి తరలింపు, పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ భూ సమస్యపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్ భూ బాధితులు, తాడి నాయకులతో గురువారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ తాడి తరలింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో గ్రామ తరలింపుపై జరిగిన సర్వేలో తేల్చిన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నివేదికలు తయారు చేయిస్తామన్నారు. 20 ఏళ్లలో లబ్ధిదారులు పెరగడంతో తాడి తరలింపునకు కేటాయించిన స్థలానికి సంబంధించిన సర్వే పూర్తి చేసి గ్రామ తరలింపుపై కృషి చేస్తానని తెలిపారు. పెద ముషిడివాడ ల్యాండ్ పూలింగ్ లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఆక్రమణదారుల విషయంలో విజిలెన్స్ ఎంక్వయిరీ రిపోర్ట్ అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి హెచ్‌డిసి అనిత, అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయేషా, పరవాడ తహశీల్దార్ అంబేద్కర్, నాయకులు బొద్దపు శ్రీనివాస్, తాడి మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి అప్పారావు, గనిరెడ్డి కనకరాజు, గొల్లవిల్లి అచ్చిబాబు, పెదముషిడివాడ గ్రామస్తులు బలిరెడ్డి అప్పారావు, కరణం నర్సింగరావు, అర్శి అప్పారావు. బొండ అచ్చిబాబు. రావాడ నాయుడు. శివశంకర్, కనకనాగేశ్వరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిలుపుదల చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరుతూ వేలాది మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ ఎం.అంగముత్తుకు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పటల్‌ను ప్రైవేటు వారికి ఇవ్వరాదని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, నిపుణులైన డాక్టర్లను, సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రయివేటుకు అప్పగించేందుకు పిలిచిన టెండర్లను రద్దు చేయాలన్నారు. పోర్టు చైర్మన్ స్పందిస్తూ సంతకాలు సేకరణ చేసి ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తాత్కాలికంగా నిపుణులైన డాక్టర్లను నియమించడానికి, సాధ్యమైనంత వరకు అందరికీ న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చట్టి త్రినాథరావు, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, ప్రెసిడెంట్ జక్కాన సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టం అమలు కాదు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మోడీ నాయకత్వంలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్టానికి సవరణ చేస్తూ తీసుకువచ్చిన బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందినప్పటికీ, న్యాయపరంగా అది నిలవదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. సుప్రీంకోర్టులో వక్ఫ్ బోర్డు ఆస్తులపై బుధవారంనాటి వాదనలు విన్న తరువాత భారత రాజ్యాంగం అంటే ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి తెలియవచ్చిందన్నారు.

తుషార్ మెహతా వాదనలు తుస్ అని ఎగిరిపోయాయన్నారు. ముస్లిముల భూములతో బిజెపి నేతలకు ఏం పనని చింతా మోహన్ ప్రశ్నించారు. దేశంలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లేదని, నిజాలను నిర్భయంగా రాయలేకపోతున్నారని తెలిపారు. చాలా మీడియా యాజమాన్యాలు వ్యాపారాల్లో మునిగిపోయారన్నారు.

ప్రేమ పేరుతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలిసీ తెలియని వయసులో ప్రేమ ఉచ్చులో పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోరాదని, లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హితవు పలికారు. ప్రేమ ముసుగులో యువత బలైపోతున్నారని, ఆవేశంలో చేసిన తప్పులకు జైలుపాలవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో 60 శాతం మంది 18-20 ఏళ్లలోపు వారే ఉండటం శోచనీయమని పేర్కొన్నారు. ఉడా చిల్డ్రన్ ఎరీనా వేదికగా విశాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'మహిళా రక్షణకు కలిసికట్టుగా' పేరిట ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్రంలో మొదటిసారిగా మహిళ రక్షణకు కలిసికట్టుగా అనే కార్యక్రమానికి విశాఖ నుంచి శ్రీకారం చుట్టామని, మహిళల రక్షణకు, ధైర్యానికి ఇదొక చక్కని వేదిక అవుతుందని మంత్రి పేర్కొన్నారు. గంజాయి యువత భవిష్యత్‌ను నాశనం చేస్తోందని, దానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎవరినీ హౌస్ అరెస్టులు చేయలేదని అన్నారు. తిరుపతిలో ఎవరిని నిర్బంధించలేదని సమావేశంలో భాగంగా పేర్కొన్నారు. జిల్లా పోలీస్ యంత్రాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీ, ఏయూ వీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న నాయకులు

నిత్యావసరాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : కరీంనగర్ జిల్లా గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ సీఈఓ దుర్గ ప్రసాద్ ఆదేశాల మేరకు ఫౌండేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కుటుంబాలకు మండలంలోని మారుమూల సున్నం మట్కా గ్రామంలో నిత్యావసర కిట్లను చిన్నమట్టపల్లి పంచాయితీ సర్పంచ్ పిట్టా రామారావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. గామా ఎంసిఒ శీలం ముత్తయ్య ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామారావు మాట్లాడుతూ గామా ఫౌండేషన్ వారు ఆరోగ్య ఆర్థిక అవసరాల కోసం మంచి విలువలతో కూడిన ఆర్గానిక్ నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గామా ఫౌండేషన్ సభ్యులు మడకం రాజు, ముచ్చిక మహేష్, సున్నం మట్కా గిరిజనులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గంగవరం : మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గంగవరం ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. మండలంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, వాహన రికార్డులు ఉండాలని కోరారు. పెద్ద వాహనదారులు ఓవర్ లోడ్ వేయడం, దానిమీద కూర్చోవడం చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు రాంబాబు, ఇజ్రాయిల్, రాజు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటిక రహదారి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి గ్రామశివారులో ఉన్న క్రైస్తవ శ్మశానవాటికకు వెళ్లే రహదారి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. క్రైస్తవ సమాధుల ప్రాంగణానికి వెళ్లే రహదారి ఇటీవల నిర్మించిన జాతీయ రహదారి పనుల్లో పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో క్రైస్తవులు శ్మశానవాటికకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వంటి పవిత్ర క్రైస్తవ పండుగలు నిర్వహించుకోవడానికి అవరోధం ఏర్పడే పరిస్థితి నెలకొంది. దీంతో ఈ సమస్యను గ్రామానికి చెందిన బుంగ రాజ్‌కుమార్ గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు దృష్టికి తీసుకెళ్లారు. టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి, టీడీపీ సీనియర్ నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు ఆధ్వర్యంలో జేసీబీతో తాత్కాలికంగా సమాధుల దొడ్డికి వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుంగ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి బుంగ రాజారావు, సోదరుడు బుంగ రాజబాబు జ్ఞాపకార్థంగా శ్మశాన వాటిక ప్రాంగణం అభివృద్ధికి విరాళం అందజేస్తామని చెప్పారు.

ఎస్‌సి వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై హర్షం

ప్రజాశక్తి-సీలేరు : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల టిడిపి ఎస్‌సి సెల్ పాడేరు నియోజకవర్గం అధ్యక్షుడు చిటికెల రాము, హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. మాల మాదిగ సహా 59 కులాలు, ఉపకులాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో షెడ్యూల్ కులాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిలోన్, నాగేంద్రబాబు, మారిబాబు, సతీష్ అచ్చియమ్మా పార్వతి, కృష్ణవేణి, రాము గౌరీ తదితరులు పాల్గొన్నారు.